
సాక్షి తిరుపతి

గురువారం । 27 । ఏప్రిల్ । 2023



పశు సంరక్షణకు 'సంచార వైద్యం'

తిరుపతి అర్బన్ : పాడి రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం సంచారం పశువైద్యశాలలను అందుబాటులోకి తీసుకువచ్చింది. -8లో



మరులుగొనేలా విరులయాగం

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో బుధవారం వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. -8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	24
చిత్తూరు	36	25
తిరుమల	32	21
గూడూరు	37	27
నగరి	37	26

న్యూస్‌రీల్

ఉచిత అడ్మిషన్ తప్పనిసరి

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఎంపిక చేసిన పేద విద్యార్థులకు 25శాతం ఉచిత అడ్మిషన్లు తప్పనిసరిగా కల్పించాలని డీఈఓ శేఖర్ స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ఉచిత నిర్బంధ విదాహక్కు చట్టం కింద 259 మంది విద్యార్థులను వివిధ పాఠశాలలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వారి ఆధార్, రేషన్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి ఫీజు లేకుండా అడ్మిషన్ ఇవ్వాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించి ఫీజు వసూలు చేస్తే ఆయా పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు.

'ఐడీఎస్'తో మహిళా వర్సిటీ అవగాహన



ఎంఓయూ చూపుతున్న ఇన్‌చార్జి వీసీ రాజారెడ్డి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై ఇన్‌ఫర్మేషన్ డేటా సిస్టమ్స్(ఐడీఎస్) సంస్థతో శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలోని మేనేజ్‌మెంట్ విభాగం బుధవారం అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ కె.రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఎన్.రజనీ సమక్షంలో ఐడీఎస్ బిజినెస్ హెడ్ సునీల్ సుబ్రమణ్యం, మేనేజ్‌మెంట్ విభాగపు ప్రొఫెసర్ జె.కాత్యాయనీ ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ ఈ ఎంఓయూ ద్వారా ఇరు సంస్థల్లోని వసతులను విద్యార్థులు వినియోగించుకోవచ్చని, అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ పెంపొందించుకునేందుకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అనురాధ, ప్రొఫెసర్ ఆర్.ఉష, డాక్టర్ రజని, డాక్టర్ వి.భార్గవిరెడ్డి పాల్గొన్నారు.

108 పైలెట్ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి తుడా : జిల్లాలో ఖాళీగా ఉన్న 108 పైలెట్ (డ్రైవర్) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ మేనేజర్ అశోక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి, బీఎన్ కండ్రిగ, పెళ్లకూరు, కేవీబీపురం , కోట, వాకాడు, వరదయ్యపాళెం, గూడూరు , తడ, డక్కిలి, వెంకటగిరి మండలాల్లో పైలెట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులై, హెవీ లైసెన్స్ గలవారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 29వ తేదీన తిరుపతి మున్సిపల్ పార్కు సమీపంలోని 108 కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివరాలకు 7032382246 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ఎస్వీ పాలిటెక్నిక్‌లో ప్రాంగణ ఎంపికలు

– 25 మందికి ఉద్యోగాలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం మేద సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఇంటర్వ్యూలకు మొత్తం 128 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎస్వీ పాలిటెక్నిక్ విద్యార్థులు 25మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పి.అచ్యుతరామారావు తెలిపారు. వీరికి ఉద్యోగం ఇవ్వడంతో పాటు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పిస్తామని ఆ సంస్థ హెచ్ఆర్ శ్రీనివాస్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్లేస్‌మెంట్ అధికారి సీహెచ్ శైలజ, కో–ఆర్డినేటర్లు ఎం.హరి ప్రసాద్, అరుణ్‌కుమార్ అభినందించారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

– 29న సర్టిఫికెట్ల పరిశీలన

తిరుపతి అర్బన్ : ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు సంబంధించి అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 29వ తేదీన పరిశీలించనున్నట్లు డీపీటీవో చెంగల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2016 జనవరి 1 నుంచి 2019 డిసెంబర్ 31వ తేదీ మధ్యలో మృతి చెందిన ఆర్టీసీ ఉద్యోగుల వారసులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఇప్పటికే పలువురు ఉద్యోగాలు పొందారని, మిగిలిన వారికి పోస్టింగ్ ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నామని వివరించారు. అర్హులైన వారు శనివారం ఉదయం 9.30 గంటలకు తిరుపతి డీపీటీఓ కార్యాలయానికి సర్టిఫికెట్లతో రావాలని సూచించారు.

పలువురు డీఎస్పీల బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లాలోని పలువురు డీఎస్పీలను బదిలీచేస్తూ బుధవారం పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి ఈస్ట్ డీఎస్పీ మురళీకృష్ణను మంగళగిరిలోని ప్రధాన పోలీసు కార్యాలయానికి బదిలీ చేసింది. ఎస్బీ డీఎస్పీ సురేంద్రరెడ్డిని ఈస్ట్‌కు, తిరుపతి వెస్ట్ డీఎస్పీ బి.నరసప్పను ట్రాఫిక్‌కు, పుట్టపర్తిలో పనిచేస్తున్న యశ్వంత్‌ను చంద్రగిరికి, ఆర్ఎస్ఐటీఎఫ్ డీఎస్పీ డీపీ కొండయ్యను తిరుమల ట్రాఫిక్‌కు, సీఐడీలో ఉన్న జి. రవికుమార్‌ను ఆర్ఎస్ఐటీఎఫ్‌కు, తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ కాటమరాజును దిశ స్టేషన్‌కు, వీఆర్‌లోని భీమారావును శ్రీకాళహస్తికి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

బాలికలదే పైచేయి!

- ఇంటర్ ఫలితాలు విడుదల
- ఫస్టియర్‌లో 56శాతం.. సెకండియర్‌లో 72శాతం ఉత్తీర్ణత



ఒకేషనల్‌లోనూ బాలికలదే హవా..

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఎప్పటిలానే ఈ ఏడాది కూడా జనరల్, ఒకేషనల్‌లో బాలికలే పైచేయి సాధించారు. మొదటి సంవత్సరం పరీక్షకు 43,713మంది విద్యార్థులు హాజరవగా, 24,425 మంది (56శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షకు 36,028 మంది హాజరవగా, 25,783మంది (72శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫస్టియర్‌కు సంబంధించి ఉమ్మడి చిత్తూరు జిల్లా రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచింది. అలాగే సెకండియర్ ఫలితాల్లో 4వ స్థానం దక్కించుకుంది.

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్ పరీక్షకు 3,131మంది హాజరవగా, 1,166 మంది (37శాతం), ద్వితీయ సంవత్సరం పరీక్షకు 2,628మంది హాజరవగా, 1,394మంది(53 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్‌లో బాలురు 25శాతం, బాలికలు 51శాతం, సెకండియర్‌లో బాలురు 39శాతం, బాలికలు 69శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల వివరాలు

కేటగిరీ	పరీక్షకు హాజరైవారు	ఉత్తీర్ణులు
బాలురు	22,239	11,204
బాలికలు	21,374	13,221
ద్వితీయ సంవత్సరం		
బాలురు	17,678	11,744
బాలికలు	18,350	14,039

గత ఐదేళ్ల ఫలితాల వివరాలు

సంవత్సరం	ఫస్టియర్ ఉత్తీర్ణత శాతం	సెకండియర్ ఉత్తీర్ణత శాతం
2017–18	67	77
2018–19	8	76
2019–20	57	64
2020–21	ఆల్ పాస్ (కోవిడ్)	
2021–22	51	58
2022–23	56	72

వసతికి దీవెన

విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. విద్యార్థుల ఉన్నత చదువులకు చేయూతనందిస్తోంది. పేద పిల్లలు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా విద్యాభ్యాసం చేసేందుకు సకల సౌకర్యాలు కల్పిస్తోంది. అందులో భాగంగా జగనన్న వసతి దీవెన పథకాన్ని అమలు చేస్తోంది. బుధవారం ఈ మేరకు విద్యార్థుల భోజనం, హాస్టల్ తదితర ఖర్చుల నిమిత్తం తల్లుల ఖాతాలో నగదు జమ చేసింది.



విద్యార్థినులకు మెగాచెక్కు అందిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి

- కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం
- లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ
- 39,960 మంది తల్లుల ఖాతాల్లో రూ.38.29 కోట్లు జమ

తిరుపతి అర్బన్ : విద్యాభివృద్ధికే తొలి ప్రాధాన్యం కల్పిస్తున్నామని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో జగనన్న వసతి దీవెన తొలివిడత నగదు పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా అనంతపురం జిల్లా నార్పల నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంప్యూటర్ బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాలో నగదు జమ చేశారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి ముఖ్యమంత్రి ప్రసంగాన్ని లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 39,960 మంది తల్లుల ఖాతాలో రూ.38.29 కోట్లు జమ చేస్తున్నట్లు వెల్లడించారు. ఉన్నత విద్యను అభ్యసించే పేద విద్యార్థులు భోజనం, వసతి ఖర్చులకు ఇబ్బంది పడకూడదనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా రెండు పర్యాయాలు నగదు అందిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ విద్యార్థులకు రూ.10వేలు, పాలిటెక్నిక్‌కు రూ.15వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20వేల చొప్పున పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి తొలి విడతగా నగదు జమ చేశామని వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ చేశారు. బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా సమాచారం

నియోజకవర్గం	లబ్ధిదారులు	జమ చేసిన మొత్తం (రూ.కోట్లలో)
చంద్రగిరి	6,395	6.81
శ్రీకాళహస్తి	5,485	5.76
గూడూరు	4,990	5.32
తిరుపతి	4,933	5.27
సూళ్లూరుపేట	4,918	5.13
సత్యవేడు	4,519	4.79
వెంకటగిరి	2,858	3.08
నగరి	1,976	2.11

జగనన్న పథకాలు భేష్



మాది తమ్మినాయనపల్లె, కందూరు పంచాయతీ, సోమల మండలం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగ అభివృద్ధికి చేస్తున్న పథకాలు భేష్‌గా ఉన్నాయి. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన కింద లబ్ధి పొందాను. అమ్మఒడి, జగనన్న విదేశీ విద్యాదీవెన లాంటి పథకాలు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతున్నాయి.

– సి. మహేష్, బీటెక్ మూడో సంవత్సరం, ఎస్వీసెట్ చిత్తూరు

సీఎం జగనన్నకు రుణపడి ఉంటా



మాది చిత్తూరు. ఎస్వీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బీకాం డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నా. మా నాన్న లేడు. అమ్మ హోటల్ నడుపుతూ నన్ను చదివిస్తోంది. ఇంటర్‌లో అమ్మఒడి కింద లబ్ధి పొందా. తర్వాత జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన కింద ఆర్థిక లబ్ధి పొందుతున్నాను. విద్యార్థుల సంక్షేమం గురించి వారి భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా.

– ఎ.యామిని, బీకామ్ డిగ్రీ రెండో సంవత్సరం

ఆర్థికభారం తగ్గించారు



మాది కడప జిల్లా బద్వేల్. రైతు కుటుంబం. చిత్తూరు ఎస్వీ సెట్ కాలేజీలో బీటెక్ ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్నా. ఇంటర్ తిరుపతిలో చదివా. రెండవ సంవత్సరం అమ్మఒడి లబ్ధి పొందాను. తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం వసతి దీవెన, విద్యా దీవెన అందించడం సంతోషంగా ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాం.

– విష్ణువర్ధన్ రెడ్డి బీటెక్ తృతీయ సంవత్సరం, ఎస్వీ సెట్ కాలేజ్, చిత్తూరు

1 నుంచి సీఎం కప్ టోర్నమెంట్

తిరుపతి అర్బన్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మే 1 నుంచి 5వ తేదీ వరకు ఏపీ సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో టోర్నీ నిర్వహణ, ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.

కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టోర్నీని విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పురుషులు, మహిళలకు సంబంధించి 14 విభాగాల్లో పోటీలు జరగనున్నట్లు వెల్లడించారు. 13 ఉమ్మడి జిల్లాల నుంచి మొత్తం 4, 999 మంది క్రీడాకారులు హాజరుకానున్నారని, అలసత్వం లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జేసీ నేతృత్వంలో ఫుడ్ కమిటీ, జిల్లా పౌర సరఫరాల అధికారి, మేనేజర్, సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి, చీఫ్ కోచ్‌లతో ఏర్పాటైన కమిటీలు భోజన వసతులు సమకూర్చాలని వివరించారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీనివాసరావు, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్, సీపీఓ అశోక్ కుమార్‌రెడ్డి, డీఎస్‌ఓ శేషాచలంరాజు, సెట్విన్ సీఈఓ మురళీకృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, చీఫ్ కోచ్ సయ్యద్ హుస్సేన్, డీపీఆర్‌ఓ బాలకొండయ్య పాల్గొన్నారు.

మహోన్నతంగా మన ఊరి పండుగ

- గంగమ్మ జాతర ప్రచారంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



ఆలయం వద్ద పులివేషాల ప్రదర్శన వీక్షిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష తదితరులు



ఎమ్మెల్యే భూమన , దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి కర్రసాము

తిరుపతి కల్చరల్ : మన ఊరి పండుగైన తాతయ్యగుంట గంగమ్మ జాతరను మహోన్నతంగా జరుపుకుందామని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలో జాతర కరపత్రాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి గంగజాతరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర పండుగగా ప్రకటించారని తెలిపారు. మే 10 నుంచి 16వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్న జాతరలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. అమ్మవారి కుంకుమార్చ మహాప్రసాదమైన కుంకుమను 3లక్షల ఆహ్వాన పత్రికలతో కలిపి అక్కచెల్లెమ్మకు అందజేసి జాతరకు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. పురాతన గ్రామదేవతగా ప్రసిద్ధి చెందిన గంగమ్మ ఆలయ ప్రాశస్త్యానికి విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు వివరించారు. దేశంలోనే అతి పురాతన గ్రామదేవతగా గంగమ్మ ఆలయంగా గంగమ్మ తిరుపతిలో వెలిసిందన్నారు. వివిధ మార్గాల ద్వారా గంగజాతర ప్రాశస్త్యం గురించి విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు తెలిపారు. పదో శతాబ్దంలో శ్రీవారి భక్తుడైన అనంతాళ్వార్ చేతుల మీదుగా గంగమ్మ ఆలయ ప్రతిష్ట జరిగిందని తెలిపారు. సుమారు 1400 ఏళ్ల కిందటే గంగమ్మ ఆలయం నిర్మితమైనట్లు పురాణ ఇతిహాసాల్లో పేర్కొన్నట్లు చెప్పారు. ఇంతటి మహిమాన్వితమైన అమ్మవారి జాతరను యావత్ భక్తకోటి సహకారంతో వైభవోపేతంగా జరుపుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ ఎం.మునికృష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్, ధనశేఖర్, రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, మద్దాలి శేఖర్ రాయల్ టౌన్ డైరెక్టర్లు నాగిరెడ్డి, వెంకటేష్ రాయల్, మునిరామిరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, తలారి రాజేంద్ర, నాధముని, ఎన్వీ సురేష్ పాల్గొన్నారు.

పులివేషాల సందడి

గంగజాతర ప్రచారం పులివేషాల సందడితో ప్రారంభమైంది. వేలూరు గుడియాత్తానికి చెందిన రాజవేల్ బృందం ప్రదర్శించిన పులివేషాల విన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే భూమన, వైఎస్సార్‌సీపీ నేత దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి కర్రసాము చేసి అలరించారు.

స్నాతకోత్సవానికి వేళాయె!

- రేపు మహతి కళాక్షేత్రంలో ఎస్వీ వేద వర్సిటీ వేడుకలు



మాట్లాడుతున్న వీసీ రాణి సదాశివమూర్తి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ 7వ స్నాతకోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు వీసీ ఆచార్య రాణి సదాశివ మూర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉత్సవానికి చాన్సలర్ హోదాలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పాల్గొంటారన్నారు. అతిథులుగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి హాజరవుతారని వెల్లడించారు. స్నాతకోత్సవంలో సర్టిఫికెట్ నుంచి పీహెచ్‌డీ వరకు వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న 550మంది విద్యార్థులకు పట్టాలు అందజేయనున్నట్లు వివరించారు. అలాగే వేద విద్య వ్యాప్తి, వేద పరిరక్షణకు కృషి చేసిన బ్రహ్మశ్రీ వి.సుబ్రమణ్యంశాస్త్రి, బ్రహ్మశ్రీ రామచంద్రమణి ద్రవిడశాస్త్రికి మహామహోపాధ్యాయ, బ్రహ్మశ్రీ కపిలవాయి రామసోమయాజిశాస్త్రి, బ్రహ్మశ్రీ సి.వంశీకృష్ణ ఘనాపాటీకి వాచస్పతి పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈక్రమంలోనే టీటీడీ ఆధ్వర్యంలో తాళపత్ర గ్రంథాల పరిరక్షణకు స్క్రిప్ట్ ప్రాజెక్టు నిర్వహిస్తున్నామని, 500 ఏళ్లు గడిచినా చెక్కుచెదరకుండా ఉండేలా భద్రపరుస్తున్నామని స్పష్టం చేశారు. తాళపత్రాలను చదివి, అర్థం చేసుకునేందుకు ప్రత్యేకంగా డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రాధేశ్యాం, టీటీడీ పీఆర్‌ఓ డాక్టర్ టి.రవి, వర్సిటీ పీఆర్‌ఓ ఆచార్య బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గంజాయి నిర్మూలన



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైం : జిల్లాలో గంజాయి విక్రయం, వినియోగాన్ని నిర్మూలించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన ఎన్డీపీఎస్ కేసులపై సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయికి చెక్ పెట్టేందుకు పోలీస్, ఎస్ఈబీ సంయుక్తంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. ఈ కేసుల్లో ప్రమేయం ఉంటే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే ఉండదన్నారు. విక్రేతలతోపాటు వినియోగించేవారిపై కూడా పీడీ యాక్టు, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. నేర నియంత్రణకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. గతంలో చేపట్టిన ఆపరేషన్ పరివర్తన 2.0తో సత్ఫలితాలు సాధించామన్నారు. అదే స్ఫూర్తితో యాంటీ డ్రగ్స్ స్పెషల్ డ్రైవ్‌ను జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా గంజాయి రవాణా, విక్రయించే, సేవించే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. క్షేత్రస్థాయిలో మాదకద్రవ్యాల ఆనవాళ్లు లేకుండా సమూలంగా అరికట్టాలని స్పష్టం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, ఆ మేరకు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని తెలిపారు.

గవర్నర్, సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

గవర్నర్, ముఖ్యమంత్రి పర్యటనలకు పటిష్ట భద్రత కల్పించాలని ఆదేశించారు. ఈ నెలలో గవర్నర్ తిరుమల, తిరుపతికి రానున్నారని, మేలో ముఖ్యమంత్రి పర్యటించనున్నారని వివరించారు. ఎయిర్‌పోర్టు నుంచి వారు సందర్శించే అన్ని ప్రాంతాల్లో కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎస్పీలు కులశేఖర్, విమలకుమారి, ఎస్ఈబీ డైరెక్టర్ రాజేంద్ర పాల్గొన్నారు.

ప్రజారోగ్య రక్షణకు ప్రాధాన్యం

- నియోజకవర్గంలో 5 లక్షల మందికి వైద్యపరీక్షలు : ఎమ్మెల్యే చెవిరెడ్డి
- మెడికల్ క్యాంపునకు కలెక్టర్‌తో కలిసి శ్రీకారం



మెడికల్ క్యాంపు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, మోహిత్‌రెడ్డి తదితరులు

పాకాల : చంద్రగిరి నియోజకవర్గ ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని దామలచెరువు పంచాయతీ బందార్లపల్లె ఎంపీయూపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గంలోని ప్రజలందరికీ వైద్య పరీక్షలు చేయించుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇందుకోసం దాదాపు ఒకటిన్నర సంవత్సరం నుంచి ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ప్రజలు తప్పనిసరిగా క్యాంపునకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీంతో ప్రాణాంతక వ్యాధులను ముందుగా గుర్తించే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. మెడికల్ క్యాంపును జిల్లా అధికారులు పర్యవేక్షిస్తారని, పరీక్షల్లో సమస్యలు గుర్తిస్తే ప్రతి నెలా 104 వాహనం ద్వారా మందులను ఉచితంగా అందిస్తామన్నారు. ప్రాణాంతక వ్యాధులను గుర్తిస్తే ఆయా రోగులను కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేర్పించి, ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా మెరుగైన చికిత్స చేయిస్తామని భరోసా ఇచ్చారు. క్యాంపునకు సహకరిస్తున్న ఎన్‌జీ రంగా మనుమడు ప్రివియ హెల్త్ సంస్థ అధినేత ఫణిని అభినందించారు. ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. అనంతరం ఫణిని కలెక్టర్‌తో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉండడం చంద్రగిరి నియోజకవర్గ ప్రజల అదృష్టమని కొనియాడారు. అసాధ్యాలను సుసాధ్యం చేయగల శక్తి రాష్ట్రంలో చెవిరెడ్డికి మాత్రమే ఉందన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఇలాంటి ఒక బృహత్తరమైన కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని తెలిపారు. మెడికల్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వ్యాధి నిర్ధారణ చేసుకుంటే సకాలంలో వైద్యం పొందే అవకాశం ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో జేసీ డీకే బాలాజీ, తుడా కార్యదర్శి లక్ష్మి, స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ భాస్కర్ నాయుడు, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మాజరెడ్డి, సర్పంచ్ సునీత, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ రమేష్ బాబు పాల్గొన్నారు.

బాధ్యతగా తెలుగు భాష పరిరక్షణ



తెలుగు భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు

తిరుపతి అర్బన్ : తెలుగు భాష పరిరక్షణను బాధ్యతగా భావించాలని తెలుగుభాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో పాలనా భాషగా తెలుగును అమలు చేయడంపై సమీక్షించారు. విజయబాబు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర, ప్రత్యుత్తరాలు తెలుగులోనే ఉండాలన్నారు. మౌఖిక భాషనే పాలనా భాషగా వాడాలని సూచించారు. ఫైళ్లు, వ్యక్తిగత రిజిస్టర్లు, లేఖలు, ప్రమోషన్లు, బదిలీలు, హాజరు పట్టిక, నోటీస్ బోర్డులు వివిధ శాఖల పేర్లు వంటి కార్యకలాపాలను తెలుగులోనే సాగించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డీఆర్‌ఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలనా బాషగా తెలుగును పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు భాషా సంఘ సభ్యులు మస్తానమ్మ, తళ్వా వెంకటయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పరధిలోని పొన్నకాలువ వద్ద బుధవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. యోగిమల్లవరానికి చెందిన అమర్‌నాథ్(37) ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్న నేపథ్యంలో మనస్తాపానికి గురైన అమర్‌నాథ్ ఉరి వేసుకుని మరణించాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

- విద్యుత్ కంచె

మృత్యుపాశమైందంటున్న స్థానికులు

కేవీబీపురం : మండలంలోని మతం గ్రామ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం బుధవారం వెలుగుచూసింది. ఎస్‌ఐ సునీల్ కథనం మేరకు.. రంగయ్యగుంట గ్రామానికి చెందిన బత్తెయ్య(40) పశువుల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం కూడా యథావిధిగా పశువులను మేత కోసం దగ్గరలోని అటవీప్రాంతానికి తోలుకెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. బుధవారం ఉదయం గ్రామానికి చెందిన పశువుల కాపరులు అడవిలో బత్తెయ్య మృతదేహాన్ని గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతుడి ఒంటిపై కరెంట్ షాక్ కారణంగా కాలిన గాయలు, చుట్టూ రక్తపు మడుగు ఉండడంతో అనుమానాస్పద మృతిగా ఏఎస్‌ఐ లోకనాథన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ కంచె కారణంగానే బత్తెయ్య మృతి చెంది ఉంటాడని స్థానికులు అనుమానిస్తున్నారు.

పశు సంరక్షణకు సంచార వైద్యం

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. పాలకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా.. పశు సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. రోగాల బారిన పడిన పశువులకు సకాలంలో చికిత్సలందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా సంచార పశువైద్యశాలలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ క్రమంలో టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసింది. బాధిత రైతు నుంచి ఫోన్ రాగానే వారి ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలందించేలా కార్యాచరణ అమలు చేస్తోంది. ఉచితంగా మందులు పంపిణీ చేయడమే కాకుండా.. అవసరమైతే శస్త్రచికిత్సలను సైతం చేయిస్తోంది.

- పల్లె ముంగిటకే చికిత్సలు
- జిల్లావ్యాప్తంగా సేవలందిస్తున్న 14 వాహనాలు
- 108 తరహాలో 1962 టోల్‌ఫ్రీ నంబర్



పశువుకు చికిత్స చేస్తున్న సంచార వైద్యశాల సిబ్బంది



సంచార పశు వైద్యశాల వాహనం

తిరుపతి అర్బన్ : జిల్లాలో వ్యవసాయం తర్వాత అధికంగా పాడి ఆధారంగానే రైతులు జీవనం సాగిస్తున్నారు. అయితే పశువులకు రోగాలు వస్తే గతంలో నానా అవస్థలు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాడి రైతులకు పూర్తిస్థాయిలో అండగా నిలుస్తోంది.



పశువుకు చికిత్స చేస్తున్న సంచార పశువైద్యశాల సిబ్బంది

ముందుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆదుకుంటూ వచ్చింది. అనంతరం పశువుల వద్దకే వెళ్లి వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టింది. సంచార పశు వైద్యశాలల పేరుతో మొబైల్ వాహనాలను ఏర్పాటు చేసింది. 108 తరహాలోనే ఎవరైనా తమ పశువులకు రోగాలు వస్తే 1962కి కాల్ చేస్తే చాలు, వెంటనే వారి ఇంటి వద్దకు వెళ్లి వైద్యం అందించేలా సకలం సమకూర్చింది. అవసరం అయిన పశువులకు ఆపరేషన్లు చేయడం, ఉచితంగా మందులను అందజేలా ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో ఏడాది కాలంలోనే 14 మొబైల్ వాహనాల ద్వారా 7,265 పశువులకు వైద్యసేవలు అందించారు.అందులో 2,400 పశువులకు ఆపరేషన్లు చేశారు. 5వేలకు పైగా పశువులకు మందులు అందజేశారు.

మూగజీవాల ఆరోగ్యానికి భరోసా

పశువుల ఆరోగ్యానికి సైతం ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. అఒక్క మొబైల్ అంబులేటరీ క్లినిక్‌కు రూ.37లక్షలు వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ట్రీవీస్(బోను)తోపాటు వివిధ రకాల వ్యాధుల ప్రాథమిక నిర్ధారణ, మలమూత్ర ,రక్త పరీక్షల కోసం అత్యంత ఆధునిక ల్యాబ్‌ను వాహనంలో ఏర్పాటు చేసింది. బరువైన పశువులను వాహనంలోకి తీసుకువచ్చేందుకు హైడ్రాలిక్ జాక్‌లిఫ్ట్‌ను సైతం అందుబాటులోకి తీసుకువచ్చింది.1962కి ఫోన్ వచ్చిన వెంటనే వెటర్నరీ మొబైల్ అంబులేటరీ క్లినిక్ వాహన సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని తక్షణ వైద్య సేవలు అందిస్తున్నారు.

పాడి రైతులకు వరం



ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొబైల్ అంబులేటరీ క్లినిక్‌లు పాడి రైతులకు వరం. కాల్ చేసిన వెంటనే ఇంటికి వచ్చి వైద్యం అందిస్తున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.అవసరం అయితే ఆపరేషన్‌లు సైతం చేయడానికి వైద్యులు ముందుకు వస్తున్నారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– సుబ్బరావమ్మ, పాడి రైతు

పశువైద్యంలో విప్లవం



పశువులకు వైద్యం చేయడానికి సంచార వాహనాల పథకం సరికొత్త విప్లవంగా భావిస్తున్నాం. వారు ఆస్పత్రికి రావడం కాకుండా... వైద్యులే వారి ఇంటికి వెళ్లి పశువులకు వైద్యం చేయడంతో పాడి రైతులకు ఎంతో సౌకర్యంగా ఉంది. దీనిపై పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పశువుల మరణాలు కూడా తగ్గుతున్నాయి. సచివాలయ పరిధిలో వెటర్నరీ అసిస్టెంట్‌ను సంప్రదిస్తే సబ్సిడీపై పశు దాణాను అందిస్తున్నాం. ప్రభుత్వ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– రవికుమార్, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

భాకరాపేట : తిరుపతి– మదనపల్లె జాతీయ రహదారిపై భాకరాపేట వద్ద బుధవారం లారీ ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలు.. స్థానికంగా నివసించే ఆదెమ్మ (65) మధ్యాహ్న సమయంలో రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. లారీ ఢీకొనడంతో ఆదెమ్మ అక్కడికక్కడే మరణించింది. పోలీసులు కేసు నమోదు చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,320
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,566
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,600
రిటైల్ వెండి గ్రాము	రూ.78.60

వైఎస్సార్‌సీపీలోకి బీజేపీ శ్రేణులు



బీజేపీ కార్యకర్తలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని 19వ వార్డుకు చెందిన సుమారు 40 మంది బీజేపీ కార్యకర్తలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి వచ్చినట్లు వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని మళ్లీ అధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు చిత్తశుద్ధితో పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు, నేతలు గోపి, అరవింద్‌రెడ్డి, పఠాన్ ఫరీద్, మున్నా, జయశ్యామ్, బావాజీ, మాతయ్య, ఫజల్, హరికృష్ణ, మాబాషా, రవి పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు



దర్శనానంతరం ఆలయం వెలుపల ఇంటలిజెన్స్ డీజీపీ సీతారామాంజనేయులు, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి



అమ్మవారి ఆలయం వద్ద తెలంగాణ ఎన్నికల అధికారి పార్థసారథి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని పలువురు ప్రముఖులు బుధవారం దర్శించుకున్నారు. అందులో ఇంటలిజెన్స్ డీజీపీ సీతారామాంజనేయులు, తెలంగాణ ఎన్నికల అధికారి పార్థసారథి ఉన్నారు. వేర్వేరుగా వచ్చిన ప్రముఖులకు ఆలయ అధికారులు, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం వెలుపల జస్టిస్ ప్రసన్న



సినీ నటుడు నాగార్జున, అమల



ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి

తిరుమల: పలువురు ప్రముఖులు బుధవారం శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న బి వరాలే, తెలంగాణ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున, ఆయన సతీమణి అమల ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల నాగార్జున, అమల మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో విడుదల కానున్న తమ పిల్లల సినిమాలు ఘనవిజయం సాధించాలని స్వామి వారిని ప్రార్థించినట్లు చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో ఒక కంపార్ట్‌మెంట్ నిండి ఉంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 62,971 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.39 కోట్లు వేశారు. టైం స్లాట్ టికెట్లు ఉన్నవారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 12 గంటల్లో, ఎస్‌ఈడీ టోకెన్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

ఎస్‌ఎస్ ట్యాంకు మరమ్మతులకు రూ.9 కోట్లు

- ఫలించిన మంత్రి ఆర్‌కే రోజా ప్రయత్నం

పుత్తూరు రూరల్: పుత్తూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పునరుద్ధరణకు రూ.9 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జె.శ్యామలారావు జీఓ ఆర్టీ నెం.269ను ఈనెల 25న విడుదల చేశారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా రెండేళ్ల పాటు చేసిన కృషి ఫలితంగా ఈ నిధులు మంజూరయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో నాసిరకంగా నిర్మించిన పుత్తూరు ఎస్‌ఎస్ ట్యాంకు 2021 మే 18న కుంగింది. 10 అడుగుల లోతుతో 200 మీటర్ల పొడవున కట్ట కుంగిపోయింది. అప్పుడు ఎమ్మెల్యే హోదాలో ఉన్న ఆర్‌కే రోజా యుద్ధప్రాదిపతికన మరమ్మతులు చేయించారు. శాశ్వత పరిష్కారం కోసం నిపుణుల కమిటీని వేయాల్సిందిగా స్పెషల్ చీఫ్ సెక్రటరీకి లేఖ రాశారు. స్పందించిన ప్రభుత్వం త్రిసభ్య కమిటీని వేసి ట్యాంకు కట్ట నిర్మాణ ప్రమాణాలను పరిశీలించింది. ఫలితంగా నేడు నిధులు మంజూరు అయ్యాయి. ట్యాంకు కట్టకు శాశ్వత పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

30 ఏళ్ల సమస్యకు రూ.30లక్షలతో పరిష్కారం



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



భూమి పత్రాలను ఎమ్మెల్యే చెవిరెడ్డి సమక్షంలో కలెక్టర్‌కు అందిస్తున్న రైతు

పాకాల : మండలంలోని ఊటువంక గ్రామానికి సరైన దారి లేకపోవడంతో గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బంది పడేవారు. ప్రభుత్వాలు మారుతున్నా దాదాపు 30 ఏళ్లుగా దారి సమస్యతో నానా ఇక్కట్లు పడ్డారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సదరు సమస్యను సులువుగా పరిష్కరించారు. రోడ్డు నిర్మాణానికి రూ.30లక్షలు మంజూరు చేయించారు. బుధవారం బందార్లపల్లె- ఊటువంక రోడ్డుకు భూమి పూజ చేశారు. ఏళ్ల తరబడి నానుతున్న సమస్యను అవలీలగా పరిష్కరించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. జీవితాంతం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ ఉపకేంద్రానికి స్థలం వితరణ

పాకాల : మండలంలోని మోగరాల పంచాయతీలో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి రూ. 15 లక్షల విలువైన భూమిని గెనెంగట్టుపల్లెకు చెందిన రైతు తులసీరామ్ వితరణగా అందించారు. బుధవారం ఈమేరకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సమక్షంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డికి భూమి పత్రాలను అందజేశారు. తోటి రైతుల కష్టం తీర్చేందుకు ఉదారంగా తన భూమిని అందించిన రైతును ఎమ్మెల్యే చెవిరెడ్డి, కలెక్టర్ అభినందించారు.

గ్రూప్1, 2 అభ్యర్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్

సాక్షి, తిరుపతి:ఏపీపీఎస్ త్వరలో నిర్వహించే గ్రూప్–1, 2 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు హైదరాబాద్‌కు చెందిన ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ పి.క్రిష్ణప్రదీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే ఆసక్తి ఉండి ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతిభ అన్వేష పరీక్షను మే 7వ తేదీ ఆన్‌లైన్‌లో నిర్వహించున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలు ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు ఉచితంగా గ్రూప్–1, 2 పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్, పరీక్ష సిలబస్ తదితర వివరాలకు 91332 37733, 91336 37733 నంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలియజేశారు.

నిబంధనలు అతిక్రమించి అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు

– డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీహరి

తిరుపతి తుడా: నిబంధనలను అతిక్రమించి అబార్షన్లు చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి హెచ్చరించారు. బుధవారం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోని సమావేశ మందిరంలో జిల్లాలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లకు ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి రెడ్డి, డీఐఓ శాంతకుమారి ఆధ్వర్యంలో సమగ్ర గర్భస్రావ సంరక్షణ (కంప్రెహెన్సివ్ అబార్షన్ కేర్)పై శిక్షణ కార్యక్రమం నిర్వహిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ ఎంటీపీ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆస్పత్రుల్లో పనిచేసే గైనకాలజిస్టులు మాత్రమే ప్రభుత్వ నిబంధనల మేరకు అబార్షన్లు చేయాలన్నారు. అలాకాకుండా ఎటువంటి అర్హతలు లేకుండా, అనుమతులు లేకుండా అబార్షన్లకు పాల్పడితే వారిపై చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్లకు కంప్రెహెన్సివ్ అబార్షన్ కేర్ (సీఏసీ)పై సమగ్ర శిక్షణ ఇచ్చామనిఆయన తెలిపారు. అబార్షన్ అనేది ఎటువంటి పరిస్థితుల్లో ఎవరికి చేయాలి, ఎవరికి చేయకూడదు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేసిన తరువాత వచ్చే ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వైద్యాధికారులు, వైద్యులు, ప్రైమరీ హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

మరులుగొనేలా విరుల యాగం




పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు



యాగానికి పుష్పాలు తీసుకువస్తున్న ఆలయ అధికారులు

తిరుపతి కల్చరల్ : నగరంలోని శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో బుధవారం అంగరంగ వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. ముందుగా ఉదయం 10 నుంచి 11 గంటల వరకు సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి వారి ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఆలయంలోని ఊంజల్ మండపంలో వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. తులసి, చామంతి, గన్నేరు, మల్లెలు, రుక్షి, కనకాంబరాలు, రోజా, తామర, కలువ, మొగలిరేకులు తదితర 11 రకాల పుష్పాలు, ఆరు రకాల ఆకులు మొత్తం 3 టన్నుల సుగంధ సుమాలతో స్వామి, అమ్మవార్లను అభిషేకించారు. ఏపీతోపాటు, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలువురు దాతలు పుష్పాలను విరాళంగా అందించారు. యాగంలో భాగంగా అర్చకులు తొలుత 108 సార్లు విష్ణు గాయత్రి మంత్రాన్ని పఠించి పుష్పాలకు అధిపతి అయిన పుల్లుడు అనే దేవుడిని ప్రసన్నం చేసుకున్నారు. ఇలా చేయడం వల్ల ప్రకృతి మాత శాంతిస్తుందని, వైపరీత్యాలు తలెత్తకుండా స్వామి వారు కరుణిస్తారని భక్తుల విశ్వాసం. బ్రహ్మోత్సవాల సమయంలో తెలియక జరిగే దోషాలకు ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో చేపట్టిన పుష్పయాగం ఆద్యంతం శోభాయమానంగా సాగింది. తిలకించిన భక్తులు తన్మయత్వంతో పులకించారు. అనంతరం రాత్రి 7 గంటలకు సీతాలక్ష్మణ సమేతంగా కోదండరామస్వామి మాడ వీధుల్లో విహరించారు. ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఏఈఓ మోహన్, సూరింటెండెంట్ రమేష్, పాల్గొన్నారు.

జూలై 23 నుంచి జాతీయస్థాయి నాటక పోటీలు



మాట్లాడుతున్న బీఎన్ రెడ్డి

తిరుపతి కల్చరల్ : తిరుపతి మహతి కళాక్షేత్రంలో జూలై 23 నుంచి జాతీయస్థాయి నాటక పోటీలు నిర్వహించనున్నట్లు అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పోటీలకు 36 పౌరాణికాలు, 69 సాంఘిక నాటికలు ఎంపికైనట్లు వెల్లడించారు. ఆసక్తిగల కళాకారులు 9581154667 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అభినయ ఆర్ట్స్ అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, చీఫ్ అడ్వైజర్ డి.విజయకుమార్ పాల్గొన్నారు.